క్లుప్తంగా

కొనసాగుతున్న పోచమ్మ జాతర


అమ్మవారి పూజలో గ్రామస్తులు

మాడ్గుల: మండల పరిధిలోని అవురుపల్లి గ్రామ సమీపంలోని పోచమ్మ తల్లి జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అవురుపల్లి, నల్లవారిపల్లి పరిసర గ్రామాల ప్రజలు వనవాస కార్యక్రమాన్ని నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆలయాన్ని మామిడాకుల తోరణాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. మాజీ ఉప సర్పంచ్ రామచంద్రి, సీనియర్ నాయకుడు లాలయ్యగౌడ్, గ్రామస్తులు యాదయ్య, విజయ భాస్కర్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం కోశాధికారిగా పాండు



తలకొండపల్లి: భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర కోశాధికారిగా నీలకంఠం పాండుని నియమిస్తూ బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన నీలకంఠం పాండు ఏబీవీపీలో పనిచేసి విద్యార్థుల సమస్యలపై పోరాడారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించాడు. పాండు మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి నాకు ఈ పదవి కట్టబెట్టిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారికి, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌కు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

స్పందన చదువుకు అండగా ఉంటాం

- శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- రూ.25వేల ఆర్థికసహాయం


స్పందనకు చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

తలకొండపల్లి: నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికీ చదువులో రాణిస్తున్న విద్యార్థిని స్పందన ఉన్నత చదువుకు చేయూతనందిస్తామని శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పడకల్‌కు చెందిన జంగమ్మ, పాపయ్య దంపతుల కూతురు స్పందన. హైదరాబాద్‌లో బీఫార్మసీ రెండవ సంవత్సరం చదువుతోంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండటంతో కళాశాల ఫీజు చెల్లించలేక స్పందన తల్లిదండ్రులు ఎంపీటీసీ రమేష్‌ను సంప్రదించగా.. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో రూ.25,000 ఆర్థిక సహాయాన్ని స్పందనకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లమ్మ, తిరుపతయ్య, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు రమేష్, శ్రీశైలం, రఘుపతి, రాములు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి చంద్రశేఖర్‌రెడ్డి


ఎమ్మెల్యే మల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి (చింటు) శుక్రవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సుమారు 100మంది కార్యకర్తలు మల్‌రెడ్డి సంక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. మల్‌రెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి నారాయణరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, అయ్యప్ప రెడ్డి, రాజు, బాబు, కృష్ణారెడ్డి, మహేశ్‌గౌడ్, పెంటయ్య, సంజీవ, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంచాల: జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు


తలకొండపల్లి: జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు


యాచారం: జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

చిరస్మరణీయుడు జగ్జీవన్‌రామ్

దివంగత భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శుక్రవారం ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో ఘనంగా జరుపుకొన్నారు. రాజకీయాలకతీతంగా నేతలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాదారు.

– సాక్షి, నెట్‌వర్క్


కడ్తాల్: జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళి అర్పించిన నాయకులు


యాచారం: జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేస్తున్న రాజేందర్‌రెడ్డి తదితరులు


మంచాల: కార్మికులకు సబ్బులు పంపిణీ చేస్తున్న కార్యదర్శి రాజ్‌కుమార్


తుర్కయంజాల్: జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


ఇబ్రహీంపట్నం రూరల్: విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆదిబట్ల కాంగ్రెస్ నాయకులు


ఆమనగల్లు: జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మున్సిపల్ కార్మికులు


ఇబ్రహీంపట్నం రూరల్: నివాళి అర్పిస్తున్న పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

ఘనంగా జుమాతుల్ విదా


కడ్తాల్: మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు


ఆమనగల్లు: ఖర్జూర పండ్లు పంపిణీ చేస్తున్న వరప్రసాద్‌రెడ్డి

కడ్తాల్: పరిధిలోని పలు గ్రామాల్లో రంజాన్ మాసం చివరి శుక్రవారాన్ని(జుమాతుల్ విదా) ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని మజీద్ ఏ ఖుబా, మజీద్ ఏ అర్షద్‌లో మధ్యాహ్నం నమాజ్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చివరి శుక్రవారం కావడంతో ప్రత్యేక ప్రార్థనలు, నమాజు నిర్వహించినట్లు ఇమామ్‌లు జహీరుద్దీన్, తహజీబ్ తెలిపారు. ఆయా మజీద్‌ల కమిటీ అధ్యక్షులు రవూఫ్, అహ్మద్ జానీ, ఉపాధ్యక్షుడు జావీద్, కోఆప్షన్ సభ్యుడు జాహంగీర్ బాబా, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, మైనార్టీ నాయకులు జాహంగీర్ అలీ, ఇర్షాద్, వాహాబ్, గౌస్, మహబూబ్‌అలీ, సల్మాన్, ఇద్రీస్ తదితరులు పాల్గొన్నారు.

ఖర్జూరా పండ్ల పంపిణీ..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని పలు మసీదుల్లో శుక్రవారం సాయంత్రం ముస్లింలకు ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖర్జురా పండ్ల ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆయా మసీదులలో జరిగిన అల్‌విదా జుమా ప్రార్థనల్లో ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు గౌస్, ఖాదర్, మహబూబ్‌అలీ, జహంగీర్, ఖాదర్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు రచ్చ శ్రీరాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, సత్యం, కొండల్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, మల్లేశ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని పలు మసీదుల్లో రంజాన్‌మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ పండుగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో మసీదుల కమిటీల అధ్యక్షులు మాసూం, గౌస్, ఖాదర్‌ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

వెల్జాల్‌లో ఇఫ్తార్ విందు

తలకొండపల్లి: పండుగలు మత సామరస్యానికి ప్రతీకలని మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెల్జాల్‌లో ఆయన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందులో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబుర్ రహ్మాన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవికుమార్, రాజు, రవి, శ్రీరామ్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో కాలనీ ప్రతినిధులతో కలిసి పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ అన్నారు. కాలనీలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు కనీస వసతులు కల్పిస్తామన్నారు. నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు రాజు, నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వర ఆలయంలో పూజలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరి దేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ నిర్వహించారు. శివుడికి పూలతో అభిషేకం చేశారు. ఉదయం శివగంగ రాజరాజేశ్వర ఆలయానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చన, దీపాలు వెలిగించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇక్కడ కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అల్లె కుమార్, డైరెక్టర్లు, ఆలయ ప్రధాన పూజారులు భక్తులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా..

పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్


కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మధుయాష్కీ గౌడ్

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవ చేస్తానని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మధుయాష్కీ గౌడ్ అన్నారు. వనస్థలిపురం సుష్మ చౌరస్తా సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. మధుయాష్కీ మాట్లాడుతూ.. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తుక్కుగూడలో జరిగే జనజాతర బహిరంగసభకు ఎల్‌బీనగర్ నుంచి భారీగా జన సమీకరణ చేస్తున్నామన్నారు. నాయకులు రామ్మోహన్‌రెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, సామ రమణారెడ్డి, సదాశివుడు, కుట్ల నర్సింహ యాదవ్, మంజులారెడ్డి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్


మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్రామ్

తుక్కుగూడ: వేసవికాలం దృష్టిలో ఉంచుకొని మున్సిపాలిటీ వ్యాప్తంగా నీటి ఎద్దడి నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ బి వెంకట్రామ్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఏఈలతో నీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఇప్పటి వరకు నీటి కొరత రాలేదన్నారు. నీటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికోసం బోర్ల మరమ్మతులు, నీటి ట్యాంకర్ల ఏర్పాటు చేశామన్నారు. ఓఆర్‌ఆర్ లోపల హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో, ఓఆర్‌ఆర్ బయటి గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా నీటి పంపిణీ చేస్తున్నామన్నారు. నీటిని వృథా చేయొద్దన్నారు. మున్సిపల్ ఏఈ భార్గవ్‌రెడ్డి, హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఏఈ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి భూమిపూజ



కందుకూరు: అగర్‌మియాగూడలో నిర్మించనున్న ప్రసన్నాంజనేయస్వామి సహిత భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయానికి శుక్రవారం వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ భూమి పూజ నిర్వహించారు. పూజారులు నవీన్‌శర్మ, రామకృష్ణ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు భూపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, జంగారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి,అనిల్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

మెజార్టీ స్థానాల్లో గెలుస్తాం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్


కడ్తాల్: సమావేశంలో మాట్లాడుతున్న బీచ్యానాయక్

కడ్తాల్: లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా శనివారం తుక్కుగూడలో నిర్వహించనున్న జనజాతర శంఖారావ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తుక్కుగూడ రాజీవ్ గాంధీ ప్రాంగణంలోనే గత తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఆరు గ్యారంటీలను ప్రకటించుకున్నామని.. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి జాతీయ స్థాయి గ్యారంటీలను కూడా తుక్కుగూడ బహిరంగ సభలోనే కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు ప్రకటించనున్నారని తెలిపారు. సమావేశంలో ఎస్సీసెల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అశోక్, సేవాదళ్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, నాయకులు సత్యంయాదవ్, శ్రీను, రాజేశ్, రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

జనజాతర సభకు తరలిరండి

ఆమనగల్లు: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ కార్యదర్శి కానుగుల దశరథం అన్నారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ..అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తుక్కుగుడలో శనివారం నిర్వహించనున్న జనజాతర బహిరంగ సభకు జిల్లా నుంచి నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం శనివారం తుక్కుగూడలో నిర్వహించనున్న జన జాతర మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండ లాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తలకొండపల్లిలో మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు, అన్నివర్గాలకు న్యాయం దక్కుతుందన్నారు. కేంద్రంలో కూడా అధికారంలోకి వస్తామన్నారు. జనజాతర సభకు కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కౌన్ బనేగా.. చైర్మన్, వైస్ చైర్మన్

- ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయంలో నేడు ప్రత్యేక సమావేశం
- చైర్మన్‌గా మర్రి నిరంజన్‌రెడ్డి ఎంపిక లాంఛనమే అంటున్న నేతలు
- వైస్ చైర్మన్ ఎంపికపై ఉత్కంఠ



ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం రూరల్: వరుస అవిశ్వాస తీర్మానాలతో ఆదిబట్ల మున్సిపాలిటీలో రాజకీయం వేడెక్కింది. నాడు బద్ధ శత్రువులు నేడు అంతా ఒకే గూటి పక్షులయ్యారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలన్నీ ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఇదే తరహాలో గతంలో కూడా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ను తొలగించడానికి మూడు పార్టీలు ఒక్కటయ్యాయి. ఇప్పుడు మళ్లీ ఎన్నుకోవడానికి కూడా ఆ మూడు పార్టీలు ఒక్కటయ్యాయి.

ప్రత్యేక సమావేశానికి ఏర్పాట్లు

ఈ యేడాది ఫిబ్రవరి 9వ తేదీన అవిశ్వాస తీర్మానాలకు సంబంధించి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లను తొలగించడానికి ప్రభుత్వం ప్రత్యేక సమావేశం నిర్వహించింది. అన్ని పార్టీల మద్దతుతో అవిశ్వాసం నెగ్గడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్ కొత్త ఆర్తికగౌడ్, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వైస్‌చైర్‌పర్సన్ కళమ్మను తొలగించారు. ఈ క్రమంలో శనివారం కొత్త చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఎన్నికకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారిగా ఆర్డీఓ అనంతరెడ్డి వ్యవహరించనున్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు చైర్మన్ ఎన్నిక, మధ్యాహ్నం 12 గంటలకు వైస్ చైర్మన్ ఎన్నిక జరగనుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ నేతల మధ్య పోటీ

ఆదిబట్ల మున్సిపాలిటీలో 15 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో ఇద్దరు మినహాయిస్తే మిగతా 13 మంది కౌన్సిలర్లు అందరూ చైర్మన్‌గా మర్రి నిరంజన్‌రెడ్డికే మద్దతిస్తున్నారు. దీంతో మర్రి చైర్మన్‌గా ఎంపిక కావడం లాంఛనమే. అయితే వైస్ చైర్మన్‌పై స్పష్టత రావాల్సి ఉంది. ఈ పదవి కోసం కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల మధ్య తీవ్ర పోటీ నడుస్తోంది. కాంగ్రెస్ నుంచి ఎంపీపటేల్‌గూడకు చెందిన యాదగిరి, బీఆర్‌ఎస్ నుంచి మహేందర్, బీజేపీ నుంచి రాములు వైస్ చైర్మన్ పదవికోసం పట్టుబడుతున్నారు. మెజార్టీ సభ్యులున్న పార్టీలు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కాబట్టి కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకరు చైర్మన్ అవుతున్నందున వైస్ చైర్మన్ స్థానం బీఆర్‌ఎస్‌కు దక్కే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఈ స్థానాన్ని బీఆర్‌ఎస్ పార్టీ నుంచి మహేందర్‌కు ఇవ్వాలని డిమాండ్ ఉంది. అలాగే కమాండ్ల యాదగిరి లేదంటే గోపగళ్ల మహేందర్‌కు కూడా అవకాశం లేకపోలేదు. మొత్తానికి రేపటితో ఈ విషయంపై ఉత్కంఠ వీడనుంది.